ఏటిగట్ల పటిష్టత పెద్దాయన చలవే..

- 20 ఏళ్ల క్రితమే పరీవాహక ప్రాంత ప్రజలకు భరోసా
- నేటికీ వారి మదిలో వైఎస్సార్



సమాంతరంగా మరోగట్టుతో పటిష్టంగా ఉన్న ఏటిగట్టు

రామచంద్రపురం: గోదావరి ఉధృతి పెరుగుతుందంటే పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితి. ఏ అర్ధరాత్రి ఏటిగట్టు తెగిపోతుందోననే ఆందోళనతో రాత్రంతా యువకులు ఏటిగట్టు వెంబడి లాంతర్లు పట్టుకుని గండ్లు పడే చోట్ల కాపలా కాయాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల నుంచి గోదావరి పొంగినా గుండెల మీద చేయివేసుకుని నిద్రపోయే స్థితిని ఆ పెద్దాయన కల్పించారు. ఆయనే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. గోదావరికి గత ఏడాది మూడుసార్లు పెద్ద ఎత్తున వరద పొంగి పొర్లుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రవహించింది. జూలై నెల వస్తుందంటే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని నదీ పరీవాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. కానీ ఏటిగట్టును పటిష్టం చేయటతో ఆనాటి పరిస్థితులు ఇప్పుడు లేకుండా పోయాయని పెద్దాయన్ని తలచుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలోని గోదావరి నది వెంబడి సుమారుగా 10 గ్రామాలు 20 శివారు గ్రామాలు 21 కిలోమీటర్ల మేర ఉన్నాయి. కూళ్ల గ్రామం నుంచి సుందరపల్లి, కోటిపల్లి, కోట, దంగేరు, కోటగుంట, భట్లపాలిక, మసకపల్లి, బ్రహ్మపురి, కాజులూరు మండలం పిల్లంక గ్రామాలతో పాటుగా వీటిని ఆనుకుని శివారు గ్రామాలు కూడా ఉన్నాయి. మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండల పరిధిలో గోదావరి నదిని అనుకుని తాతపూడి, కపిలేశ్వరపురం శ్రీరాంపురం, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల ప్రజలు జీవిస్తున్నారు. 1986లో గోదావరి వరద నీరు భారీగా రావటంతో కె.గంగవరం మండలం సుందరపల్లి, కోట, పిల్లంక, బ్రహ్మపురి గ్రామాల వద్ద గోదావరి గట్టు బలహీనంగా మారటంతో గండ్లు పడ్డాయి. దీంతో ప్రజలను అప్పటి ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి.

మరో ఏటిగట్టు

2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏటిగట్లు పటిష్టం చేయాలని తలచి బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన జొన్నాడ నుంచి కపిలేశ్వరపురం మండలం, కె.గంగవరం మండలం, కాజులూరు మండల గ్రామాల మీదుగా యానాం వరకు 42 కిలోమీటర్లు గోదావరి గట్టును కిలోమీటరకు రూ.కోటి చొప్పున రూ.42 కోట్లతో పటిష్టం చేశారు. ఏటిగట్టును అనుకుని గోదావరిలో మరో గట్టును నిర్మించారు. 2007లో పనులు ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తి చేయటంతో ఏటిగట్టు బలపడింది. అప్పటి నుంచి ఎప్పుడు గోదావరికి వరద నీరు వచ్చిన ఏ చింతా లేకుండా ఉంటుంది. ఏటిగట్టు గండ్లు పడి తెగే పరిస్థితి నుంచి ఆనాడే ఉపశమనం కలిగించారు. 1986లో వచ్చిన విధంగా ఏటిగట్టు పటిష్టం చేసిన తరువాత రెండు మూడు ఏళ్ల వరద వచ్చినా.. ఎటువంటి ప్రమాదాలు జరకుండా పరీవాహక ప్రాంత ప్రజలు నిశ్చింతగా ఉంటున్నారు. ఏటిగట్టు పటిష్టం చేసిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని స్మరించుకుంటున్నారు. గోదావరి ఎంత పొంగినా గట్లు మాత్రం చెక్కు చెదరకుండా ఉంటున్నాయి.

భయాన్ని పోగొట్టారు



జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి వస్తుందంటే చాలు భయంతో గడపాల్సి వచ్చేంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఏటిగట్టును పెద్దది చేశారు. సమాంతరంగా మరో గట్టు నిర్మించటంతో గట్టు తెగిపోతుందని భయం పోయింది. మహానేతను ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు.

– కొప్పిశెట్టి వెంకటరమణ, సర్పంచ్, దంగేరు

ఆయన కృషితోనే..



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఎంతో శ్రద్ధతో ఏటిగట్లను అభివృద్ధి చేశారు. దీని మూలంగానే గోదావరి ఎంత ప్రవాహం వచ్చినా గుండెల మీద చేయి వేసుకుని ఈ ప్రాంత ప్రజలు ధీమాగా ఉంటున్నారు. ఆయన చేసిన కృషి ఎన్నటికి మరువలేనిది.

– చిల్లే నాగేశ్వరరావు సర్పంచ్, కూళ్ల

వైఎస్సార్‌ను ఎన్నటికీ మరువలేం



మా గ్రామాన్ని అనుకుని గోదావరి గట్టు ఉంది. ఎప్పుడైనా గోదావరి పోటు వచ్చిందంటేనే భయం భయంగా గడపాల్సి వచ్చేది. కానీ రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషితో ఏటిగట్లు బలపడ్డాయి. దీంతో ధీమాగా ఉంటున్నాము. అప్పట్లో గోదావరి వరద వస్తే ఏటిగట్టుకు దూరంగా కుటుంబంతో వెళ్లిపోయే వాళ్లం కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– పిల్లి సత్యనారాయణ, రైతు, దంగేరు

క్లుప్తంగా

రేపు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం

మండపేట: స్థానికంగా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి పెంకే గోవింద రావు తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో ఇన్‌కంట్యాక్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులంతా హాజరుకావాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

నేత్రదానం



వీరరాఘవులు

కె.గంగవరం: గ్రామానికి చెందిన వైట్ల వీర రాఘవులు (60) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. రాఘవులు కుటుంబ సభ్యులు వైట్ల చంద్రిక, కోటీశ్వరరావు, రాధికా ఆయన నేత్రాలను దానం చేయడంతో కాకినాడకు చెందిన ఐ బ్యాంక్ వారు వచ్చి కార్నియాను సేకరించారు. కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన పలువురు అభినందించారు. కాగా అందరికి సుపరిచితుడైన రాఘవులు మృతి చెందడంతో కె.గంగవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మండపేట: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. మండపేట పట్టణ, మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల లక్ష్యం, ఇప్పటి వరకూ ఎంత పూర్తయ్యిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన లక్ష్యాన్ని పూర్తి చేయడం ద్వారా పేదల సొంతింటి కల సాకారానికి కృషి చేయాలని ఆమె సూచించారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.రాజు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ల భద్రతపై అవగాహన



వెల్లలో బుర్రకథ చెబుతున్న గొర్రెల బ్రదర్స్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం రామచంద్రపురం పట్టణానికి చెందిన బుర్రకథ కళాకారులు గొర్రెల రాము, గొర్రెల కృష్ణ, గొర్రెల శ్రీనివాసరావుల బృందం గెయిల్ ఇండియా గ్యాస్ పైపులైన్ల భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ నిరోధక టీకాలు



ద్రాక్షారామలో పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేస్తున్న ఏడీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పశు వైద్యశాలలో గురువారం పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఒ.రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 22 పెంపు జంతువులకు టీకాలు వేశారు. ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా పెంపుడు జంతువులకు అన్ని రకాల వ్యాక్సిన్‌లు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ల డాక్టర్ పి.రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది గంగాధర్‌కు సత్కారం

రామచంద్రపురం: రామచంద్రపురం బార్ అసోసియేషన్ న్యాయవాది ఇనకోటి గంగాధర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాకినాడ రీజియన్ ప్యానల్ అడ్వకేట్‌గా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్‌వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కోశాధికారి జేఎస్ఎస్ చక్రవర్తి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య, సీనియర్ న్యాయవాదులు బుద్ధవరపు సూర్యనారాయణ, కాకులవరపు రామచంద్రరావు, కోటిపల్లి లోవ రాజు, కముజు సూర్యనారాయణ, సూరంపూడి సత్యనారాయణ, దొమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై ఆరా



వడ్లమూరులో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి సుధాసాగర్

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాలను జగనన్న సురక్ష కార్యక్రమం నోడల్ అధికారి, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం ఎస్.సుధాసాగర్ గురువారం సందర్శించారు. నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం తీరును పరిశీలించారు. ఇంటింటా సర్వేలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను అడిగి తెలుసుకున్నారు. టోకెన్ల జారీ, సమస్యల పరిష్కారాలకు వెచ్చిస్తున్న సమయాన్ని ఆరా తీశారు. ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కె.సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

- జగనన్న సురక్ష సర్వే గురువారం పలు గ్రామాల్లో కొనసాగింది. వర్షం వస్తున్నా గొడుగులు సాయంతో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. వాకతిప్పలో నిర్వహించిన సర్వేను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగస్రవంతి, కార్యదర్శి శివచక్రవర్తి పరిశీలించారు. సర్వేలో ప్రజలు లేవనెత్తుతున్న సమస్యలను నమోదు చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



ఏడిదలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

మండపేట: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం కొనియాడారు. గురువారం ఏడిదలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి రామారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, నాయకులు మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వినపురెడ్డి శివ పాల్గొన్నారు. మండపేటలోని 7, 8 వార్డుల్లో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, ఎమ్మార్పీఎస్ నేత దూలి జయరాజు, టీడీపీ నాయకులు మందపల్లి దొరబాబు, చాపల వీరబాబులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుపాకలో గడప గడపకూ..



వెదురుపాకలో పథకాలపై బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజలను కోరారు. వెదురుపాకలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి (పెద్దబ్బాయ్), జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి తదితరులతో కలసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పథకాల అమలులో ఏనాడూ రాజకీయ జోక్యం లేదన్నారు. పేదరికమే ప్రాతిపదికగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల గుమ్మం వద్దకే పథకాలు అందిస్తున్నారని అన్నారు. పేదలు, మహిళలు, యువత, రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవస్థానం చైర్మన్లు తాడి బులివెంకటరెడ్డి, టేకుమూడి రాంబాబు, సొసైటీ మాజీ చైర్మన్ సత్తి వీరవెంకట, మాజీ సర్పంచ్ నల్లమిల్లి శివశంకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సత్తి పద్దారెడ్డి, చిన్నీలు, సత్తి శ్రీనివాససోమిరెడ్డి, ఆకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి పనిచేస్తాం

- స్పష్టం చేసిన మండపేట మత్స్యకారులు
- ఎమ్మెల్సీ తోటకు ఘన సత్కారం



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంటే తామంతా ఉంటామని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తమ సంఘ సభ్యులంతా కలసి పనిచేస్తామని మండపేట మత్స్యకార సంఘం నాయకులు స్పష్టం చేశారు. స్థానిక మత్స్యకార రామాలయం వద్ద గురువారం సూర్యచంద్ర ఫిషర్ మెన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోటను సన్మానించారు. సొసైటీ అధ్యక్షుడు కాటా గోపి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి, సంఘ నాయకుడు ఆబోతు వీరభద్రరావు తదితరులు మాట్లాడుతూ 200 మంది సభ్యులతో మొదలైన తమ సొసైటీలో ఇప్పుడు 2 వేల మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. తామంతా ఎమ్మెల్సీ తోట విజయానికి కలసికట్టుగా పనిచేస్తామని అన్నారు. తమ జనాభా పెరిగినా గతంలో ఉన్న చెరువులే ఇప్పుడు ఉన్నాయని, అవి కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమై చేపలు చనిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార కల్యాణ మండపం వద్ద మహిళల కోసం కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. అలాగే పెంచిన చెరువుల లీజు ఫీజు తగ్గించేందుకు కృషి చేయాలని అన్నారు. తమ సంఘానికి సంబంధించి ఏ సమస్యపై వెళ్లినా ఎమ్మెల్సీ వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని గోపి, వీరభద్రరావు అన్నారు.

సంక్షేమానికి కృషి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, మత్స్యకార నేతలను ఆయన వద్దకు తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట తెలిపారు. చెరువుల అభివృద్ధికి, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాను ఓటు రాజకీయాలు చేయనని, తన వద్దకు వచ్చిన వారి కులమత వర్గాలు, పార్టీలు చూడకుండా సమస్యలు పరిష్కరించి పంపడం లక్ష్యంగా పనిచేస్తానన్నారు. అనంతరం మత్స్యకార సంఘం నాయకులు, మహిళలు ఆయనను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాసరావు, జిన్నూరి సాయిబాబా, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, మెరైన్ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు బలసాది రంగారావు, సంఘ నాయకులు ఆబోతు వీరభద్రరావు, కాటా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల మద్యం ధ్వంసం

రామచంద్రపురం: పట్టణంలోని రామచంద్రపురం ఎస్ఈబీ అధికారులు ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు మూడు నెలల కాలంలో 73 కేసుల్లో పట్టుకున్న రూ. 2.50 లక్షల విలువైన 1237 యానం మద్యం సీసాల్లోని మద్యాన్ని, 60 లీటర్ల సారాని గురువారం పారబోశారు. రామచంద్రపురం ఎస్ఈబీ సీఐ సీహెచ్‌వీ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా, రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెంట్ మాదాల శ్రీనివాసరావు, ఎస్సై ఈతకోట రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి



యర్రపోతవరంలో లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ సింధు



వడ్లమూరు గ్రామసభలో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని యర్రపోతవరం, పామర్రు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. యర్రపోతవరంలో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా పొందవచ్చన్నారు. గతంలో కావల్సిన ధ్రువపత్రాల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని ఒక్క రోజులోనే సంబంధిత పత్రాలు ఉచితంగా అందుకోవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, వాసంశెట్టి వెంకట దుర్గ, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, వాసంశెట్టి సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పట్టణంలో...

రామచంద్రపురం: పురపాలకర సంఘ పరిధిలోని గంగుమళ్లవారివీధి సచివాలయం వద్ద నేడు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేదల ప్రయోజనాలే లక్ష్యం

కపిలేశ్వరపురం: పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వడ్లమూరు సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు అన్నారు. వడ్లమూరు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో గ్రామస్తులు లేవనెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించారు.

వివిధ శాఖల పరిధిలోని 1,899 సేవలను గ్రామసభలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పేదల ఇంటికే పథకాలు చేరుతున్నాయన్నారు. అందుకు జగనన్న సురక్ష కార్యక్రమమే నిదర్శనమన్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంఎల్ఓ జగన్, పీఏసీఎస్ చైర్మన్ పుత్సకాయల రామారావు, సచివాలయ కన్వీనర్ రెడ్డి రుద్రమూర్తి, నాయకులు మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



ద్వారపూడిలో కైలాస రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ద్వారపూడి ప్రజల సౌలభ్యం కోసం సుంకర వెంకటరమణ (ఎస్‌వీఆర్) ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెంకటరమణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు వస్త్ర వ్యాపారి నాని రూ.15 లక్షలతో ప్రత్యేకంగా తయారు చేయించిన కైలాస రథాన్ని గురువారం ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ తండ్రి పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్న నానిని ప్రశంసించారు. తొలుత వెంకటరమణ చిత్రపటానికి ఎమ్మెల్సీ తోట పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కన్వీనర్ పోతుల రాంబాబు, నాయకులు తులా శ్రీరంగారావు, సంగిశెట్టి రమేష్, తొంటాపు సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీని బోధనకు అన్వయించుకోవాలి



డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

రామచంద్రపురం: ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ టెక్నాలజీ వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని, బోధనలో డిజిటల్ టెక్నాలజీని అన్వయించుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేపై ఇస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోగలుగుతారన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అకడమిక్ క్యాలండర్‌ను అనుసరించి, సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు డైరీ రాస్తూ, విద్యార్థులు కూడా డైరీ రాసే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. విద్యార్థులు రాసే నోట్సులు మొక్కుబడిగా కరెక్షన్ చేయకుండా, తప్పొప్పులను గుర్తించాలన్నారు. తప్పులున్నచోట సరిచేసి, ఒప్పు రాసిన విద్యార్థులను అభినందించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసినప్పుడే ఉపాధ్యాయుల బోధనకు గుర్తింపు వస్తుందన్నారు. డిజిటల్ టెక్నాలజీపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డీవైఈవో పి.షాలెంరాజు, సమగ్ర శిక్ష ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవో ఎం.శ్రీనివాసు, కంప్యూటర్ ఫ్యాకల్టీ సీహెచ్ ప్రసన్న, శివకృష్ణ, సపోర్టింగ్ ఫ్యాకల్టీ రవికుమార్, ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శేరిలంక పీహెచ్‌సీ తనిఖీ



శేరిలంక పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

కె.గంగవరం: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర వైద్యులకు సూచించారు. మండలంలోని శేరిలంక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీహెచ్‌సీల్లో మందులతో పాటు సిబ్బందిని, వైద్యులను అందుబాటులో ఉంచిందని సిబ్బంది చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మన్నలను పొందాలని కోరారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో జరిగే ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ ఆర్.రామకృష్ణ, వెంకటేష్, యంఓ రాహుల్, యంపీహెచ్ఓ సీహెచ్ సూర్యారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే పేదరిక నిర్మూలన సాధ్యం

మంత్రి వేణుగోపాలకృష్ణ



కాజులూరులో లబ్ధిదారులకు అమ్మఒడి చెక్కు అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: విద్యాభివృద్ధితోనే దేశంలో పేదరిక నిర్మూలన సాధ్యమౌతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. జగనన్న అమ్మఒడి సంబరాల్లో భాగంగా గురువారం కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొని లబ్ధిదారులకు మెగా చెక్ అందజేశారు. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్య అనేది పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అందుకే సీఎం జగన్ తన పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. గతంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరచాలంటూ పలు సభలు, సమావేశాల్లో అప్పటి నాయకులు తరచూ ప్రసంగాలు చేస్తుండేవారని అయితే దానికనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవటంతో వారి మాటలు నీటిమూటలుగా మిగిలేవన్నారు. వసతులు సమృద్ధిగా సమకూరటంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రి రూపంలో జగనన్న విద్యాకానుక ద్వారా అందిస్తుంటడంతో విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. పేదవాడి విద్యకు ఇంత పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించిన ఘనత దేశం ఏ నాయకుడికి దక్కలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బరావు, సర్పంచ్ దండంగి సరోజని, పీఏసీఎస్ చైర్మన్లు సత్తి శ్రీరామారెడ్డి, ఎం.రాము, పోతురాజు బాబూరావు, యాళ్ల సత్తిబాబు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.